TELANGANA POLITRICKS

www.vishalabharati.com
epaper:vishalabharati.com

# పొలిట్రిక్స్

2023-2024

విశాల భారతి

vishalabharathi Telugu Daily

బుధవారం,
08.11.2023
హైదరాబాద్

1pm edition




పొలిట్రిక్స్



## టికెట్లు ఇంకెప్పుడిస్తరు?

- నామినేషన్లకు గడువు గంటల సమయమే..
- కాంగ్రెస్, బీజేపీల్లో పూర్తి కాని టికెట్ల పంపిణీ
- ఆశావాహుల్లో పెరుగుతున్న టెన్షన్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లకు కొన్ని గంటల గడువు మాత్రమే ఉంది. నవంబర్ 3న నామినేషన్లు మొదలు కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటికే భారీ సంఖ్యలో నామినేషన్లు వేశారు. అనేక మంది అభ్యర్థులు సరైన ముహూర్తాలు చూసుకుంటూ నామినేషన్లు వేస్తున్నారు. అయినా ఇంకా కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించకపోవడంతో బీజేపీ, కాంగ్రెస్ ఆశావహుల్లో అసహనం పెరిగిపోతోంది. సీఎం కేసీఆర్ నవంబర్ 9న గజ్వేల్, కామారెడ్డిలో నామినేషన్లు దాఖలు చేయనున్నారు. గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఇప్పటికే నామినేషన్ వేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే కొడంగల్‌లో నామినేషన్ వేశారు. కామారెడ్డిలో కూడా రేవంత్ నామినేషన్ వేయాల్సి ఉంది.

అయితే మరోవైపు నామినేషన్లకు గడువు సమీపిస్తున్నా బీజేపీ, కాంగ్రెస్ ఇంకా కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించలేకపోయాయి. కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడ, చార్మినార్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మరోవైపు బీజేపీ 12 మంది అభ్యర్థులతో నాలుగో జాబితాను విడుదల చేసింది. చెన్నూరు నుంచి దుర్గం అశోక్‌కు, ఎల్లారెడ్డి నుంచి సుభాష్‌రెడ్డికి టికెట్లిచ్చింది. హుస్నాబాద్ నుంచి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి, సిద్దిపేట నుంచి దూది శ్రీకాంత్‌రెడ్డికి, వికారాబాద్ నుంచి పెద్దింటి నవీన్ కుమార్‌కు టికెట్లిచ్చింది. కొడంగల్ నుంచి బంటు రమేశ్‌కుమార్, గద్వాల్ నియోజకవర్గం నుంచి బోయ శివ, మిర్యాలగూడ నుంచి సాధినేని శివకు టికెట్లిచ్చింది. మునుగోడు నుంచి చల్లమల్ల కృష్ణారెడ్డి, నకిరేకల్ నుంచి మొగులయ్య, ములుగు నుంచి అజ్మీరా ప్రహ్లాద్ నాయక్, వేములవాడ నుంచి తుల ఉమ టికెట్లు దక్కించుకున్నారు. వీరంతా నామినేషన్లు వేయాల్సి ఉంది.మిగిలిన 19 స్థానాల్లో జనసేనకు 8 స్థానాలు కేటాయించింది బీజేపీ. జనసేన 8 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించింది. కూకట్‌పల్లి నుంచి ప్రేమ్‌కుమార్, తాండూరు నుంచి శంకర్ గౌడ్, కోదాడ నుంచి మేకల సతీష్‌రెడ్డి, ఖమ్మం నుంచి మిర్యాల రామకృష్ణ టికెట్లు దక్కించుకున్నారు. నాగర్ కర్నూలు నుంచి వంగ లక్ష్మణ్ గౌడ్, వైరా నుంచి సంపత్ నాయక్, కొత్తగూడెం నుంచి లక్కినేని సురేందర్ రావు, అశ్వారావుపేట నుంచి ముయబోయిన ఉమాదేవికి టికెట్లు కేటాయించారు. వీరు నామినేషన్లు వేయాల్సి ఉంది. అయితే అభ్యర్థులను ప్రకటించిన కొన్ని సీట్ల విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. వాటిని కూడా తేల్చాల్సి ఉంది. బీజేపీ మరో 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు మరో రెండు రోజుల సమయమే ఉండడంతో ఆశావహులు టెన్షన్‌లో ఉన్నారు. ఎన్నికల తేదీ కూడా సమీపిస్తుండటంతో ప్రచారానికి కూడా సమయం సరిపోయే పరిస్థితి లేదు. దీంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.







# అవినీతికి కేరాఫ్ కాళేశ్వరం!

- ఎన్నికల ప్రచారంలో ఇదే హాట్ టాపిక్
- మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో రేగిన దుమారం
- వివాదం రాజేసిన అన్నారం బ్యారేజీలో బుంగ
- డిజైన్ నుంచి ప్రాజెక్టు ప్రారంభం వరకు వివాదాలే
- విపక్షాల విమర్శలకు స్పందించని బీఆర్ఎస్‌నేతలు
- సీఎం కేసీఆర్ మౌనంపై అనేక అనుమానాలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం హాట్ టాపిక్. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో టాప్‌లో ఉంది. అధికార పార్టీ ఘనంగా చెప్పుకొనే ‘ కాళేశ్వరం ప్రాజెక్టు’ అత్యంత చర్చనీయాంశం అయింది. అన్ని బాగుంటే.. ఈపాటికి కాళేశ్వరం ఘనతను గొప్పగా చెప్పుకొనే అవకాశం బీఆర్ఎస్ కు ఉండేది. కానీ, అనుకోకుండా మేడిగడ్డ బ్యారేజీ కుంగడం దుమారం రేపింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ వాటర్ కమిషన్ ఇచ్చిన నివేదిక బీఆర్ఎస్‌ను ఇరుకున పడేసింది. అదే సమయంలో అన్నారం బ్యారేజీలో బుంగ పడడం... వివాదాన్ని మరింత రాజేసింది. అధికార పార్టీ నేతల అవినీతికి ఇదే సాక్ష్యం అంటూ విపక్షాలు ప్రజల్లోకి వెళుతున్నాయి.

**విమర్శలకు వేదిక**

నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభం నుంచి వివాదాలే. అవకాశం దొరికినప్పుడల్లా విమర్శలకు వేదికగా మారింది ఈ ప్రాజెక్టు. మరోవైపు కాళేశ్వరం తెలంగాణకు వరదాయిని అని బీఆర్ఎస్ ప్రభుత్వం చెబుతూ వస్తుండగా.. ప్రాజెక్ట్ వ్యయం, మెయింటనెన్స్ అంతా గుదిబండనే అని నిపుణులు, విపక్షాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టు ప్రాణహిత - చేవెళ్ల ను మార్చి నిర్మించారని కాంగ్రెస్ ఆరోపించింది. రీ డిజైన్ సహా అన్ని విషయాల్లో సీఎం కేసీఆర్ పూర్తి పర్యవేక్షణలో భారీగా అవినీతి జరిగిందని చెబుతోంది. అధికార పార్టీకి కాళేశ్వరం ప్రాజెక్ట్ ఏటీఎంగా మారిందని ప్రచారానికి కూడా ప్రజల నుంచి మద్దతు వస్తోంది. ముఖ్యంగా చిన్న వరదకే గత ఏడాది పంప్ హౌస్ ల మునక నుంచి అన్నారం బ్యారేజీలో బుంగల వరకు అన్ని సీఎం కేసీఆర్ మెడకు చుట్టుకున్నాయి. అధికార నేతలు అసలు స్పందించేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రాజెక్టులు అన్నాక ఇవన్నీ సహజమేనని, కాంట్రాక్టర్లదే బాధ్యత అంటూ చేతులు దులుపుకోవడం కూడా అనేక సందేహాలను రాజేస్తున్నాయి. విపక్షాల ఆరోపణలు నిజమని ప్రజలు ఆలోచన చేసే పరిస్థితి వచ్చింది.

**కేసీఆర్ కుటుంబానికి ‘ఏటీఎం’**

ఇక కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందనేది ప్రతిపక్షాల మరో ఆరోపణ. తాజాగా ప్రాజెక్టులో 25 వేల కోట్లు చేతులు మారాయని ప్రొఫెసర్ కోదండరాం కూడా ఆరోపించారు. ముఖ్యంగా కేసీఆర్ కుటుంబమే లబ్ధి పొందిందనేది విపక్షాల ప్రధాన విమర్శ. కాగా, ప్రధాని మోదీ కూడా కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి డబ్బులు రాల్చే ఏటీఎంలా మారిందని ఆరోపించారు. ప్రదాని స్థాయి వ్యక్తి కూడా కేసీఆర్ అవినీతిపై వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజకీయంగా సాగే ఈ విమర్శలను పక్కన పెడితే.. సరిగ్గా ఎన్నికల సమయంలోనే కాళేశ్వరంలో లోపాలు బయటపడడం బీఆర్ఎస్ కు ఎదురుదెబ్బేనని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఇది తీవ్ర నష్టం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. కేసీఆర్ పూర్తిగా సంకల్పించి.. రీ డిజైన్ చేసి నిర్మాణం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో లోపాలు బహిర్గతం కావడంపై ప్రజల్లో కూడా అనుమానాలు కలుగుతున్నాయి.



### తెలంగాణకు వరమా? శాపమా?

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి.. బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మొన్నటిదాక అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ వరకు ఇటీవల కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ను, ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేసి విమర్శల వర్షం కురిపించారు. తెలంగాణ ప్రదాతగా చెప్పకొనే కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మరో అగ్ర నేత ప్రియాంక గాంధీ కూడా తమ ప్రసంగాల్లో కాళేశ్వరం అవినీతిని ప్రస్తావించారు. అయితే, ఇప్పటివరకు మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు మాత్రమే ప్రతిపక్షాల విమర్శలపై స్పందించారు. కాళేశ్వరం తెలంగాణకు వరమని, కాంగ్రెస్ శనీశ్వరమని పంచ్ డైలాగులు కొట్టారు. ఎవరెన్ని చెప్పినా కాళేశ్వరం అవినీతి ఆరోపణలపై సీఎం కేసీఆర్ స్పందించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కేసీఆర్ కాళేశ్వరంపై అసెంబ్లీలోనే ప్రజంటేషన్ ఇచ్చారని.. మరి ఇప్పడెందుకు మాట్లాడరని ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. ప్రజా సంఘాలు, రిటైర్డ్ ఇంజనీర్లు కూడా ప్రశ్నిస్తున్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన తీన్మార్ మల్లన్న..

- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ‘హస్తం’ పార్టీ
- పార్టీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామని ఆఫర్?
- మల్లన్న చేరికతో మరింత జోష్‌పెరగడం ఖాయం

**విశాల భారతి, హైదరాబాద్:**

తెలంగాణలో ఎన్నికల సందడి కొనసాగుతోంది. బీఆర్ఎస్‌పార్టీ హ్యాట్రిక్ సాధించాలని తెగ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈసారి గెలుపు తమదే అన్న ధీమాతో శాయశక్తులా ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ వ్యూహం ఎవరికీ అర్థం కావడం లేదు. అధికార బీఆర్ఎస్ పార్టీ కూడా కాంగ్రెస్ వ్యూహాలను అనుసరించలేకపోతోంది. ఒకవైపు ఇతర పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు నిరంతరం కాంగ్రెస్‌లో చేరుతుండగా, మరోవైపు ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుండడంతో బీఆర్ఎస్‌కు కంటిమీద కునుకులేకుండా పోతుంది.

కేసీఆర్ ప్రభుత్వంపై నిత్యం నిప్పులు చెరిగే చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌లు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ విషయాన్ని టీ కాంగ్రెస్ ‘ఎక్స్’ వేదికగా ప్రకటించింది.

గతకొంతకాలంగా మల్లన్న కాంగ్రెస్ పార్టీలో చేరుతారంటూ వార్తలు రాగా వాటిని నిజం చేస్తూ ఆ ప్రచారానికి తెర దించారు మల్లన్న. గతంలో బీజేపీలో చేరిన మల్లన్న ఆ తరువాత ఆపార్టీకిరాజీనామా చేశారు. అంతకుముందు హుజూర్‌నగర్ ఉపఎన్నికలు, పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు. ఇక ఈ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని, మంత్రి మల్లారెడ్డిని ఓడిస్తానంటూ శపథం చేశారు మల్లన్న. కానీ ఇప్పుడు సడన్‌గా ఆయన కాంగ్రెస్ లో చేరారు. అటు కాంగ్రెస్ కూడా మేడ్చల్ అభ్యర్థిగా తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కేటాయించింది. ఈ క్రమంలో మల్లన్నకు అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామని కాంగ్రెస్ ఆఫర్ చేసినట్లుగా తెలుస్తోంది. తీన్మార్ మల్లన్న చేరికతో కాంగ్రెస్ లో మరింత జోష్ పెరుగుతుందని చెప్పడంలో నో డౌట్.

## కారుకు ‘రివర్స్ గేర్’!






- ఎక్కడ చూసినా ‘హస్తం’ పార్టీదే హవా
- బీఆర్ఎస్‌కు చుక్కలు చూపెడుతున్న కాంగ్రెస్
- ఓటమి భయంలో మంత్రులు, సిట్టింగ్ లు
- సొంత పార్టీ లీడర్ల సహకారం అంతంతే..
- చాపకింద నీరులా అసంతృప్తుల గ్రౌండ్ వర్క్
- మంత్రులను హెచ్చరిస్తున్న గులాబీ బాస్

**విశాల భారతి, హైదరాబాద్:**

ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ నేతలకు కాంగ్రెస్ చుక్కలు చూపెడుతోంది. ఎంతో వ్యూహాత్మకంగా అభ్యర్థుల ఎంపిక నుంచి బీ ఫారాల పంపిణీ వరకు ఆచీతూచీ అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ ఎత్తులకు గులాబీ బాస్ కు ముచ్చెమటలు పడుతున్నాయి. దీంతో ప్రతి సభలో అబద్ధాలను ప్రచారం చేసేందుకు కూడా వెనుకడుగు వేయడం లేదు. నిర్మోహమాటంగా కాంగ్రెస్ పై అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు గులాబీ నేతలు. అయితే, చాలా మంది మంత్రులకు వారి నియోజకవర్గాల్లో ఎదురుగాలి వీస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో వారికి చేదు అనుభవాలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత, అసంతృప్తి ఊహించనంతగా ఉన్నట్లు ప్రచార సరళిని చూస్తే తెలుస్తోంది. టికెట్ రాలేదనే అసంతృప్తితో ఉన్న సొంత పార్టీ నేతల సహకారం.. కూడా కొరవడుతోంది. ఇదే అంశాన్ని పార్టీ సీనియర్లు బాస్‌కేసీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో గులాబీ బాస్.. జాగ్రత్త అంటూ వెంటనే సంబంధిత మంత్రులకు అలర్ట్ మెసేజ్ పంపినట్లు తెలుస్తోంది.

**మంత్రులే సుప్రీంగా ఉన్నా..**

నియోజవర్గాల్లో కొందరు మంత్రులపై తీవ్ర వ్యతిరేకత ఉన్నది. అవినీతి, అక్రమాలు, దందాలు, అనుచరుల బెదిరింపులు ఇలా ప్రస్తుత క్యాబినెట్‌లో ఉన్న సగం మంది మంత్రులు ఓడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇవన్నీ ముందే తెలిసినా కేసీఆర్ మాత్రం సిట్టింగ్‌లందరికీ టికెట్ల పేరుతో మళ్లీ వారినే అభ్యర్థులుగా ఖరారు చేశారు. సంక్షేమ పథకాలను పంపిణీ చేస్తున్నా.. జిల్లా స్థాయిలో మంత్రులే సుప్రీంగా ఉన్నా.. ప్రజల్లో, ఓటర్లలో వ్యతిరేకత, అసంతృప్తి ఎందుకు పేరుకుపోయిందన్నది పార్టీని తికమకపెడుతోంది. రానున్న ఎన్నికల్లో ఒక్కో మంత్రికి ఒక్కో రకమైన అంశంతో ఓటర్ల నుంచి చిక్కులు తప్పవన్నది సుస్పష్టం.

**సిట్టింగ్ లపై తీవ్ర వ్యతిరేకత**

కొన్ని నియోజకవర్గాల్లో సిట్టింగ్ లపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఆయా స్థానాల్లో టిక్కెట్లు ఆశించి భంగపడ్డ కొందరు పార్టీలు మారారు. దీంతో మంత్రులు, కొందరు సిట్టింగ్ లపై గెలుపుపై వ్యతిరేకత ప్రభావం చూపే అవకాశాలున్నాయి. మెజార్టీ గులాబీ నేతలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పరిస్థితి కంప్లీట్‌రివర్స్ అయింది. అధికార పార్టీ నేతల వ్యవహారశైలితోనే తిప్పలనేది వారి భావన. కొందరు ఉన్నత వర్గాలకు చెందిన నేతలు బీసీ లీడర్లు, తమకు అనుకూలంగా లేని వారిపై దాడులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ రాబోయే ఎన్నికల్లో ఎఫెక్ట్ చూపుతుందనే చర్చ సాగుతోంది. అలాగే అధికార పార్టీ నేతల్లో కుమ్ములాటలు ఎలాగు ఉన్నాయి. కేటీఆర్, కేసీఆర్, హరీశ్‌రావు చెప్పడంతో కొందరు వెనక్కు తగ్గినట్లు కనిపిస్తున్నా.. ప్రచారంలో వారు ఎంతవరకు కలిసి నడుస్తారనేది కీలకం.

**లోకల్ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత**

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు లాంటి నేతలు కొందరు తమకు తిరుగే లేదని భావించారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. కాంగ్రెస్ నుంచి ఇప్పుడు వాళ్లకు ప్రమాదం పొంచి ఉన్నది. ఆయా నేతలపై లోకల్ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది. హస్తం పార్టీ తరఫున టికెట్ పొందిన వారికి ప్రజల్లో సానుభూతి ఉంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఈసారి ఎన్నికల్లో కలిసొస్తుందని భావిస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ కొందరికి సీఎం కేసీఆర్ పదవుల పందెరాలు వేసినా.. ఆయా వర్గాలు ఎన్నికల్లో పనిచేయడం కష్టమేనన్న చర్చలు సొంత పార్టీలోనే జరుగుతున్నాయి. కొన్నిచోట్ల సొంత పార్టీ లీడర్ల నుంచే సహాయ నిరాకరణ ఎదురవుతున్నది. ఈసారి ఎన్నికల్లో వాళ్లకు ఇదే అతి పెద్ద సమస్యగా మారనున్నది. చాపకింద నీరులా గ్రౌండ్ వర్క్ మాత్రం కొందరు మంత్రులు, సిట్టింగ్ కలు వ్యతిరేకంగా జరుగుతున్నదని టాక్. ఇక మరికొందరు నేతలపై స్థానికంగా అనేక అంశాలు ప్రభావం చూపనున్నాయి. మంత్రులు తమ స్థాయికి తగినట్టుగా వ్యవహరించడం లేదనే టాక్ లోకల్ ప్రజల నుంచి వినిపిస్తున్నది. జిల్లాలలో నామినేటెడ్ పదవులు ఆశించి భంగపడ్డ స్థానిక లీడర్లు కూడా వారికి వ్యతిరేకంగా పనిచేస్తే వారికి గడ్డు పరిస్థితే. ముఖ్యంగా అధికార పార్టీ నేతలపై భూ కబ్జా ఆరోపణలు ఓటింగ్‌లో ప్రభావం చూపే ఛాన్స్ ఉంటుందని తెలుస్తోంది.